క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తుల తాకిడి


విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామిస్వామి వారు

పెరవలి: అన్నవరప్పాడులోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి వేలాది మంది భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. స్వామివారికి తలనీలాలు వందలాది మంది భక్తులు సమర్పించారు. దాతల ఆర్థిక సహాయంతో 6 వేల మందికి ఉచిత అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతి శనివారం భక్తులకు దాతల సహకారంతో అన్న సమారాధన, ఉచితంగా ప్రసాదాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

నేడు మండల సమావేశం

పెరవలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ వెంకట రమణ తెలిపారు. ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్ అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని ఆయన కోరారు.

ఉండ్రాజవరం: స్థానిక మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

అసంపూర్తిగా నిలిచిన ఇళ్లకు నిధులు

తాళ్లపూడి: మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలకు అదనపు నిధులు ఇస్తున్నట్టు హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో 176 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. వీరికి ఈ నెల 24న కొవ్వూరు లిటరరీ క్లబ్‌లో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశంలో నిధులు అందజేస్తామని చెప్పారు.

రైతులకు రాయితీపై అపరాల విత్తనాలు

నల్లజర్ల: మండలంలోని రైతులకు 50 శాతం రాయితీపై అపరాల విత్తనాలు అందిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ తెలిపారు. మినుము విత్తనాలు కిలో రూ.140 కాగా రూ.70కి, పెసర కిలో రూ.135 కాగా రూ.65కు అందిస్తున్నట్టు చెప్పారు. రైతు సేవా కేంద్రాల నుంచి రైతులు విత్తనాలు తీసుకోవచ్చన్నారు. వేసవిలో రైతులు అపరాల సాగు చేపట్టాలని సూచించారు.

నీటిఎద్దడి లేకుండా చూడాలి

నిడదవోలు: వేసవిలో ప్రజలకు నీటిఎద్దడి లేకుండా మంచినీటి సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల మున్సిపల్ ఆదేశించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలో బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దన్నారు. ఏవైనా పనులు ఉంటే ఉదయం, సాయంత్రం వేళల్లో చేసుకోవాలని సూచించారు. ఆస్పత్రుల్లో ఎలక్ట్రాల్ వాటర్, ఓఆర్ఎస్‌లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వీసీ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు ఎండీ షకీరాబేగం, చిలకల శారదాదేవి, కారింకి నాగేశ్వరరావు, మున్సిపల్ డీఈఈ సత్యనారాయణ, మున్సిపల్ ఏఈ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లులో 24న డ్రై డే

చాగల్లు: ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా చాగల్లులో ఈ నెల 24న డ్రై డేగా పాటిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి ఎండీ ఆలీ శనివారం తెలిపారు. గ్రామంలో ప్రజలకు తాగునీరు సరఫరా చేసే వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరిచి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ డ్రై చేస్తామన్నారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలని సూచించారు. సోమవారం నీటి ఇబ్బందులు రాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నల్లజర్ల: అయ్యవరంలో ఇటీవల మారుబోయిన వెంకటేశ్వరావు ఇల్లు కూలిపోవడంతో ఆ కుటుంబ సభ్యులు నిరాశ్రులయ్యారు. కాగా శనివారం బాధిత కుటుంబాన్ని జనసేన నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు పరామర్శించి రూ.12 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గుడిశే శివకృష్ణ, కవులూరు సత్తిబాబు, పెనుమాక కిశోర్, కఠారి సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ వ్యాఖ్యలపై దుమారం

- గత సమావేశంలో సంస్కారం లేదనడంతో సభ్యుల మండిపాటు
- వివరణ ఇవ్వాలంటూ ఆందోళన
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం


కొవ్వూరు పురపాలక సంఘం సమావేశంలో చైర్‌పర్సన్‌ను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు: గత పురపాలక సంఘ సమావేశంలో అజెండాలోని అంశాలపై సమీక్ష ముగిశాక వైఎస్సార్ సీపీ సభ్యులు బయటి వెళ్లిన సందర్భంలో చైర్‌పర్సన్ బావన రత్నకుమారి సభ్యులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు కౌన్సిల్ సమావేశంలో దుమారం రేపాయి. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో చైర్‌పర్సన్ రత్నకుమారి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 22వ వార్డు కౌన్సిలర్ కంఠమణి రమేష్‌బాబు మాట్లాడుతూ గత కౌన్సిల్ సమావేశం ముగింపు దశలో సభ్యులు బయటి వెళ్లితే సంస్కారం లేదా ? అని మాట్లాడటంపై వివరణ ఇవ్వాలని పట్టుబట్టారు. సమావేశం చివరిలో బయటికి వెళ్లితే సంస్కారం లేదని వ్యాఖ్యానించడం ఎంత వరకు సమజసం అని చైర్‌పర్సన్‌ను ప్రశ్నించారు. తమ మనో భావాలను కించపరిచేలా మాట్లాడడంపై సభ్యులు ధ్వజమెత్తారు. అంకోలు వెంకట లీల్లిపద్మలీల, రుత్తల భాస్కరరావు, మద్దిపట్ల సాయిగీత, చీరా అరుణ కుమారి, వరిగేటి లలిత కుమారి, వైస్ చైర్‌పర్సన్లు మన్నె పద్మ, గంద్రోతు అంజనీదేవి తమను కించపరిచే విధంగా మాట్లాడడంపై సమాధానం చెప్పాలంటూ చైర్‌పర్సన్‌ను నిలదీశారు. సమావేశం ముగిసిందని చైర్మన్ ప్రకటించిన తర్వాతే సమావేశం ముగిసినట్లు అని చైర్‌పర్సన్ రత్నకుమారి వివరణ ఇచ్చారు. తాను కొత్తగా వచ్చానని, సమావేశం చివరివరకూ ఉండకుండా సభ్యులు వెళ్లిపోవడంతో ఆవేదనను వ్యక్తం చేశానని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. చైర్ పర్సన్‌గా పనిచేసిన అనుభవజ్ఞులున్నారు. మీరు అవమానిస్తే చూస్తూ ఉండాలా అని సభ్యులు ప్రశ్నించారు. దీనిపై చర్చ జరిగింది. మధ్యాహ్న భోజన సమయం మించిపోతున్న తరుణంలో తమకు కుటుంబ బాధ్యతలు ఉంటాయని మహిళా ప్రతినిధులు గుర్తు చేశారు. తనను అవమానపరచడమే మీ ఉద్దేశమని చైర్ పర్సన్ వ్యాఖ్యానించారు. చైర్‌పర్సన్‌గా సభ్యులు తనను గౌరవించడం లేదని ఆగ్రహం వ్యక్త పరిచారు. చైర్‌పర్సన్‌కు ఇవ్వాల్సిన గౌరవం ఇస్తున్నామని రుత్తల భాస్కరరావు, వైస్ చైర్ పర్సన్‌లు తెలిపారు.

రైళ్ల హాల్టుపై కౌన్సిల్ తీర్మానం చేయాలి

కోవిడ్‌కు ముందు కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో ఆగే 34 ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టును పునరుద్ధరించాలని కోరుతూ కౌన్సిల్ తీర్మానం చేయాలని కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ కోరారు. రైల్వేస్టేషన్ పరిరక్షణ సమితి సభ్యులు వీటి విల్సన్ రాజు మాట్లాడుతూ గతంలో ఇక్కడ ఆగే 34 ఎక్స్‌ప్రెస్‌లను కొవ్వూరు స్టేషన్ ఆపాలని ఇప్పటికే హైకోర్టులో పిల్ వేశామన్నారు. దీనిపై రైల్వేశాఖ రెస్పాండ్ కాలేదన్నారు. రైల్వేశాఖ జీఎంకు కోర్టు నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందించకపోవడంతో 60 రోజుల్లో వివరణ ఇవ్వాలని కోర్టు ఆదేశించిందన్నారు. 34 రైళ్లను ఆపాలని, లేకుంటే తదుపరి చర్యలకు బాధ్యులవుతారని హైకోర్టు హెచ్చరించినట్లు ప్రకటించారు. తమ ఉద్యమానికి కౌన్సిల్ తీర్మానం తోడైతే సమస్య పరిష్కారమవుతుందన్నారు. పురపాలక సంఘం బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మిగిలిన అజెండా అంశాలను ఈ నెల 27వ తేదీన నిర్వహించే సమావేశంలో చేర్చాలని సభ్యులు కోరడంతో సమావేశం ముగించారు. వైస్ చైర్ పర్సన్‌లు మన్నె పద్మ, గంద్రోతు అంజనీదేవి, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై గరంగరం

- సచివాలయ సిబ్బంది సక్రమంగా పని చేయడం లేదని సభ్యుల ఫిర్యాదు
- గ్రామాల్లో సమస్యలపై చర్చ
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి


హాజరైన అధికారులు, ఎంపీటీసీ సభ్యులు

తాళ్లపూడి: గ్రామాల్లో పుంత రోడ్లు వేయాలని, సారాను అరికట్టాలని, డ్రైన్ల నిర్మాణం చేపట్టాలని, సీసీ రోడ్లు వేయాలని, సచివాలయాల్లో సిబ్బంది సరిగ్గా పనిచేయడం లేదని ఇలా పలు సమస్యలపై సభ్యులు గళమెత్తారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమస్యలపై చర్చలతో సమావేశం వాడీవేడిగా సాగింది. వ్యవసాయం, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, గృహనిర్మాణ, పంచాయతీ రాజ్, ఆరోగ్యం, రెవెన్యూ, వెటర్నరీ, విద్యాశాఖ అధికారులు పలు అంశాలను సమావేశంలో వివరించారు. మండల ఏవో రుచిత మాట్లాడుతూ 6150 రైతులు తమ భూములకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. దీనిపై సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వకుంటే సమావేశాలను బహిష్కరిస్తామన్నారు.

ఈ–కేవైసీ చేయించుకోవాలి

తహసీల్దార్ భారతి మాట్లాడుతూ మండలంలో 4400 మంది రేషన్‌కార్డు దారులు ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. మండలంలో 655 మంది ఇళ్ల స్థలాలు ఆన్‌లైన్ చేసి ఉన్నాయన్నారు. దీనిపై ఎంపీటీసీ హరిబాబు మాట్లాడుతూ గ్రామంలో పలువురుకి గతంలో పట్టాలు ఇచ్చారని, ఇప్పటికీ స్థలాలు చూపలేదన్నారు. ఎంపీపీ, సర్పంచ్‌లు పరశురామారవు, గండి రాంబాబు మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో సిబ్బంది సక్రమంగా పని చేయడం లేదని ఆరోపించారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ మండల స్థాయి అధికారులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు మాట్లాడుతూ ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు తగిన గౌరవం ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు గ్రామాల్లో సమస్యలు ఉంటే చెప్పమని కోరగా సభ్యులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పుంతరోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, డ్రైన్లు, సీసీ రోడ్లు తదితర సమస్యలను సభ్యులు ఏకరువు పెట్టారు. ఆయా సమస్యల పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. గంజాయి, సారా కేసుల్లో నిందితులు ఏ పార్టీ అయినా సపోర్టు చేయవద్దన్నారు. మండల సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి పరశురామారావు, వైస్ ఎంపీపీ కోదాటి కనకం తాళ్లపూడిలోని కరిబండి విద్యా సంస్థలకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే ముప్పిడికి వినతి పత్రం అందజేశారు. సమావేశంలో ఎంపీడీవో టీబీ వెంకటరమణ, ఇన్‌చార్జి తహసీల్దార్ పి.మోహన భారతి, వైస్ ఎంపీపీ కోదాటి కనకయ్య, ఈవోపీఆర్డీ కేఎస్ వీరన్న, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి


పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

నిడదవోలు: దూబచర్లలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సంతమార్కెట్, ఇందిరా నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహాల వద్ద కేవీఎస్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేశారు. దళిత యువత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు జువ్వల రాంబాబు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానించటం అంటే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, పార్లమెంట్‌ను అవమానించినట్టే అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు యలగాడ రాజ్పాల్, రవ్వా సురేష్, అడ్డాల నాని, చంటి, వర్మ, శ్రీను, రాజు, కిరణ్, శ్రీను బసవరాజు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి చెప్పుల దండ


ముసుళ్లగుంటలో ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

నల్లజర్ల: మండలంలోని ముసుళ్లగుంటలో మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు శనివారం తెల్లవారుజామున చెప్పులదండ వేశారు. దీంతో టీడీపీ నాయకులు, గ్రామస్తులు టెంట్ వేసి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ నందమూరి శారదాదేవి ఎన్టీఆర్ విగ్రహం చేరుకుని స్థానికులతో మాట్లాడారు. ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల ఈ ప్రాంతంలో గంజాయి బ్యాచ్, దొంగలు ఎక్కువయ్యారని, ఆ తరహ వ్యక్తులే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటువంటి చర్యలకు పాల్పడే వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాకర్ల శేషగిరిరావు, నందమూరి రామకృష్ణ, బలుసు గంగరాజు, ఐనంపూడి వెంకటేశ్వరావు, బలుసు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేతో రైతులకు మేలు


గుడ్డిగూడెం గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ అజయ్‌బాబు

గోపాలపురం: భూముల రీసర్వేతో రైతులకు మేలు జరుగుతుందని తహసీల్దార్ కె.అజయ్ బాబు అన్నారు. మండలంలోని గుడ్డిగూడెం గ్రామ సచివాలయం వద్ద శనివారం భూముల రీసర్వేపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అజయ్ బాబు మాట్లాడుతూ గ్రామంలో భూ సమస్యల సత్వర పరిష్కారానికి రీసర్వే దోహదపడుతుందన్నారు. రైతులు రీసర్వేకు సహకరించాలని కోరారు. ఒకరి భూమి మరొకరికి ఆన్‌లైన్ చేశారంటూ కొంత మంది రైతులు గ్రామ సభలో ఫిర్యాదు చేశారు. రైతుల భూమి విషయంలో ఎటువంటి అవకతవకలు జరగవని, ఆన్‌లైన్ సమస్యలపై జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మడిచర్ల ప్రసాద్, రైతులు రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లు: భూముల రీ సర్వేకు మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన బ్రాహ్మణగూడెం పంచాయతీ వద్ద శనివారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గురువెల్లి కుమారి అధ్యక్షతన జరిగిన సభలో సర్వే ఏడీ బి.లక్ష్మీనారాయణ, తహసీల్దార్ ఎం.మెరికమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వే ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రైతులు, భూ యజమానులు రీ సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎం.కమల్ సుందర్, టి.వెంకటేశ్వరరావు, ఏవీఎస్ గోపాలకృష్ణ, ఎంపీటీసీ ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ ప్రత్తిపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులు తీవ్రమైన నేరం


దేవరపల్లి న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి సాయికృష్ణ


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి అనురాధ


దేవరపల్లి: బాలికలపై లైంగిక వేధింపులు తీవ్రమైన నేరమని జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సాయికృష్ణ అన్నారు. కొవ్వూరు న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై శనివారం న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయవాది కెవీఎస్ఎస్ అరవింద్ అధ్యక్షత జరిగిన సదస్సులో న్యాయమూర్తి సాయికృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని పోక్సోచట్టంపై అవగాహన కల్పించారు. 16 ఏళ్లలోపు బాలబాలికలపై లైంగిక వేధింపులు జరిగితే 7 నుంచి 10 సంవత్సరాలు, 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల వారిపై లైంగిక వేధింపులు జరిగితే జీవిత ఖైదు శిక్ష ఉంటుందని తెలిపారు. 18 ఏళ్లలోపు అబ్బాయిలపై లైంగిక వేధింపులు జరిగినా పోక్సో చట్టం వర్తిస్తోందన్నారు. యుక్తవయసు బాలబాలికలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని సూచించారు. ఎస్సై వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చిన్నపిల్లలపై రోజురోజుకూ లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో యాదవోలు, యర్నగూడెం, చిన్నాయగూడెం గ్రామాల్లో ఎక్కువగా లైంగిక దాడులు, వేధింపుల కేసులు వస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇటీవల ఆరు కేసులు నమోదు కాగా కౌన్సెలింగ్ ఇచ్చి అవగాహన కల్పించినట్టు చెపారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్ రెడ్డి, కొవ్వూరు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మద్రి వెంకటేష్, న్యాయవాదులు ఎ.సుధాకరరావు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

కొవ్వూరు: చిన్నారులపై లైగింక దాడులకు పాల్పడుతున్న నీచుల అకృత్యాలకు అడ్డుకట్ట వేసేందుకు పోక్సో చట్టం ఉందని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎం.అనురాధ పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో పోక్సోచట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నారులపై అకృత్యాలకు పాల్పడుతున్న నిందితులకు ఏడేళ్ల నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారన్నారు. విద్యార్థులు పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమాజంలో చిన్నారులపై కొనసాగుతున్న లైగింక దాడుల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.రామ్మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.రమేష్, న్యాయవాదులు వీఆర్‌వీ ప్రసాద్, సీహెచ్ శ్రీనివాస్, సూరిబాబు పాల్గొన్నారు.

తాళ్లపూడి: పోక్సో చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతీ అన్నారు. తాళ్లపూడి సచివాలయం వద్ద శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు వి.నంద, పి.హరీష్, వెంకట్రాజు మహిళలు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి చేస్తా


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు: పట్టణ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందులు దుర్గేష్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి అన్ని విధాలుగా పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. 2025– 26 బడ్జెట్ అంచనాల మేరకు ప్రారంభ నిల్వ రూ.14.53 కోట్లు, మూలధన ఆదాయం రూ.13.48 కోట్లు, రూ. 5.37 కోట్లతో ముగింపు నిల్వతో రూపొందించిన బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాలకు నీటి లభ్యత లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ సైదు చంద్రశేఖర్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి సమాధానం ఇస్తూ ఈ అంశాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. గృహాలు నిర్మిస్తున్న లబ్ధిదారుల అవసరాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చెస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ పీఎం ఏవై అమృత్ 2.0 పథకంలో భాగంగా సుమారు రూ.5 కోట్లతో మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకు, పైపులైన్ పనులు చేపడతామన్నారు. ఈ పనులు పూర్తయితే పూర్తిస్థాయిలో నీటి సమస్య తీరుతుందన్నారు. పట్టణాభివృద్ధికి నిధులు తీసుకువస్తున్న మంత్రి కందుల దుర్గేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొవ్వూరు: వాడపల్లి మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల గడువు ఈ నెల 25తో ముగుస్తుందని ప్రిన్సిపల్ వి.ఆనంద్‌రాజు తెలిపారు. పాఠశాలలో 40 సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో ఏప్రిల్ 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొవ్వూరు: ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ –2కు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మెప్మా టీఎంసీ జేవీవీఎస్ భవాని శనివారం తెలిపారు. 21 నుంచి 24 ఏళ్ల వయస్సు కలిగి పదో తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైనా వారికి 12 నెలలు పాటు ఇంటర్న్‌షిప్ ద్వారా ప్రతి నెల రూ.5 వేలు అందిస్తూ పని నేర్పిస్తారన్నారు. దరఖాస్తుదారులు కచ్చితంగా కనీసం పది పాసై ఉండాలన్నారు. ఐఐటీ, ఐఐఎం, నేషనల్ లా ఇనిస్టిట్యూట్ వంటి సంస్థల్లో డిగ్రీ పూర్తి చేసిన వారు అనర్హులన్నారు. సీఏ, సీఎంఏ, ఎంబీఏ, ఎంబీబీఎస్ చేసిన వారు కూడా అనర్హులని తెలిపారు.

ట్రాక్ నిర్మాణంపై అభిప్రాయ సేకరణ

నిడదవోలు: మండలంలోని శెట్టిపేట, తాళ్లపాలెం, సింగవరం గ్రామాల మీదుగా రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం రైతుల నుంచి అధికారులు అభిప్రాయాలను సేకరించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన రైతుల సమావేశానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హాజరయ్యారు. రైల్వే ట్రాక్ నిర్మిస్తే పంట పొలాలు దెబ్బతింటాయని, ఏటా ఎర్రకాలువ వరదలతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. రైల్వే ట్రాక్ నిర్మిస్తే వరద నీటి పారుదల ఇబ్బందులు ఏర్పడతాయని గతంలో జిల్లా ఉన్నతాధికారులకు రైతులు నివేదించుకున్నారు. దీంతో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి నిపుణుల కమిటీని నియమించారు. ఈ కమిటీ సభ్యులతో రైతుల నుంచి అభిప్రాయ సేకరణ సమావేశాన్ని నిర్వహించారు. రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం గట్లు కాకుండా పిల్లర్లు ఏర్పాటు చేసి ట్రాక్ నిర్మాణం చేపట్టాలని రైతులు సూచించారు. రైతుల కోరిక మేరకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని రాష్ట్ర మంత్రి దుర్గేష్ రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేసీ చినరాయుడు, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, నిడదవోలు తహసీల్దారు నాగరాజునాయక్, ఆర్ఐ సత్యేంద్ర పాల్గొన్నారు.

ఉల్లాస్ పరీక్షలపై శిక్షణ

పెరవలి: స్థానిక డ్వాక్రా కార్యాలయంలో శనివారం ఉల్లాస్ పరీక్షలపై ఇన్విజిలేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం బి.రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో 700 మంది నిరక్షరాసులు ఉన్నట్లు గతంలో గుర్తించామని, వీరందరికీ గత ఏడాది నవంబర్ నుంచి నేటి వరకు వివిధ అంశాలపై బోధన చేశామన్నారు. వీరికి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఇందుకోసం మండలంలో 25 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేసినట్టు తెలిపారు. సీసీలు కె.కనకదుర్గ, టి.శ్రీనివాస్, అకౌంటెంట్ టి.మహాలక్ష్మి పాల్గొన్నారు.

విద్యతోనే అసమానతలు దూరం

ఉండ్రాజవరం: విద్యతోనే సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగిపోతాయని ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు అన్నారు. ఉండ్రాజవరంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యా ప్రవేశంపై శనివారం ర్యాలీ నిర్వహించారు. లింగాలదిబ్బ ప్రాంతంలో పర్యటించి 6–14 సంవత్సరాల లోపు పిల్లలను బడిలో చేర్పించడంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎంఈవో సీహెచ్ సక్సేనారాజు మాట్లాడుతూ గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించడంతో పాటు వారిని బడిలో చేర్చుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.నయోమి, ఉపాధ్యాయులు సునీత, శ్రీనివాసు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

కొవ్వూరు: స్థానిక సంత మార్కెట్ సమీపంలో పెందుర్తి సుధారాణి అనే మహిళకు చెందిన మోటారు సైకిల్‌ను అపహరించిన కేసులో కట్టా నవీన్, చాలపరెడ్డి శివకుమార్‌ను అరెస్ట్ చేసినట్లు శనివారం ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు. నవీన్ రాజమహేంద్రవరం లాలాచెరువు సమీపంలోని వాంబే కాలనీకి, శివకుమార్ అన్నపూర్ణపేటకు చెందినవారన్నారు. ఈనెల 17వ రాత్రి ఇంటి ముందు పార్కింగ్ చేసిన మోటారు సైకిల్ చోరీకి గురికావడంతో 18వ తేదీన సుధారాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో నిందితుల నుంచి మోటారు సైకిల్‌ను రికవరీ చేసి శనివారం రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని ఎస్సై తెలిపారు.